గ్రామ సభల్లో గరం.. గరం

ఎల్లారెడ్డిపేటలో రుణమాఫీ కోసం నిలదీస్తున్న బాధితుడు

రాజన్న సిరిసిల్ల, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన గ్రామసభల్లో జనం తిరుగబడుతున్నది. అధికారుల తీరుపై గరం గరమవుతున్నది. ఏ ఊరిలో చూసినా, ఏ పట్టణంలో చూసినా తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. నాలుగు పథకాల అమలుపై గురువారం జిల్లాలో గ్రామ సభలు నిర్వహించగా, అంతటా గ్రామస్తులు మర్లపడ్డారు. నిరసన తెలిపారు. అధికారులు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులకు సంబంధించి అర్హుల పేర్లు చదువుతుండగా, ఎక్కడికక్కడ నిలదీశారు. తమ పేర్లు లేవని, అర్హుల ఎంపిక సరిగా జరగలేదంటూ విరుచుకుపడ్డారు. సమాధానం చెప్పలేక అధికారులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రశ్నించారు. పలుచోట్ల కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం చూపడం, పోలీసులతో బందోబస్తు కల్పించి బాధితులను బెదిరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా..? ఇందిరమ్మ పాలన అని ప్రశ్నించారు.

ఎల్లారెడ్డిపేట మండలంలో రచ్చరచ్చ

ఎల్లారెడ్డిపేట, జనవరి 23: మండల కేంద్రంతోపాటు దుమాల, అక్కపల్లి, తిమ్మాపూర్, గుండారం, పోతిరెడ్డిపల్లిలో గ్రామ సభలు రసాభాసగా మారాయి. ఎల్లారెడ్డిపేటలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల లిస్టు చదువుతున్న క్రమంలో ఆయా గ్రామాల ప్రజలు అభ్యంతరం చెప్పారు. అనర్హులకు పెద్దపీట వేసి, అర్హులను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించగా, ఎన్నిసార్లు అప్లై చేసుకుంటారని నిలదీశారు. ఎల్లారెడ్డిపేట, దుమాలలో సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించారు. ముందు జాగ్రత్తగా మహిళా పోలీసులను రంగంలోకి దించి, అదుపు చేసే ప్రయత్నం చేశారు.

కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం

ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన గ్రామ సభ వేదికపై బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు అన్నీతానై వ్యవహరించడం విమర్శలకు తావిచ్చింది. కాగా, పలువురు గ్రామస్తులు అధికారులతో తమ సమస్యను చెప్పుకునేందుకు వెళ్తున్న క్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు దిగగా, అంతే దీటుగా బాధితులు నిలదీశారు. పోలీసులు కలుగజేసుకుని శాంతింపజేశారు.

అందరినీ సంతృప్తి పరిచేందుకు..

ఎల్లారెడ్డిపేటలో ఇందిరమ్మ ఇల్లు కోసం దాదాపు 450 మంది అర్జీ పెట్టుకోగా, అధికారులు అందరినీ సంతృప్తి పరిచేందుకు గ్రామ సభలో పేర్లు చదివి వినిపించారు. కానీ మంజూరైనవి కేవలం 78 మాత్రమే అని తెలియడంతో అర్హత ఉండి రాని వారు అధికారులు, నాయకులపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాగే గుండారంలోనూ కొందరు మినహా అందరిపేర్లను చదివారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం అందరినీ సంతృప్తి పరిచేందుకు చేస్తున్న ప్రయత్నమని ప్రజలు బాహాటంగానే విమర్శలు చేశారు. ఆయా సభల్లో ఇక్కడ ఏఎంసీ చైర్మన్ సాబెరా బేగం, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ప్రత్యేకాధికారి ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దారు రాంచందర్, ఎంపీవో జోగం రాజు, కార్యదర్శి ప్రవీణ్ ఉన్నారు.

అనర్హులకు ఇండ్లు, ఆత్మీయ భరోసా ఎట్లిస్తరు..?

గంభీరావుపేట, జనవరి 23: నర్మాల గ్రామ సభ రసాభాసగా జరిగింది. కాంగ్రెస్ నేతలు, అధికారులపై గ్రామస్తులు మండిపడ్డారు. ఆత్మీయ భరోసా పథకంలో 90 శాతం, ఇందిరమ్మ ఇండ్లలో 50 శాతం అనర్హులను ఎంపిక చేశారని ఆగ్రహించారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీని కొత్తగా గ్రామస్తుల సమక్షంలో ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. భూమి ఉన్న వారికి ఆత్మీయ భరోసా, బంగ్లా ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమేంటని..? ప్రశ్నించగా, పేరు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో భగ్గుమన్నారు. ఇంకెన్ని సార్లు అర్జీ పెట్టుకోవాలంటూ నిలదీశారు.

నిజామాబాద్‌లో జనాగ్రహం

కోనరావుపేట, జనవరి 23: నిజామాబాద్ గ్రామ సభ గందరగోళంగా మారింది. లబ్ధిదారుల జాబితాలపై గ్రామస్తులు మండిపడ్డారు. ఆస్తులు ఉన్న వారి పేర్లే జాబితాలో ఉన్నాయని, నిరుపేదల పేర్లు ఏమయ్యాయంటూ అధికారులను నిలదీశారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించగా, ఇంకెన్ని సార్లు చేసుకోవాలంటూ ప్రశ్నించారు. కాగా, పలు గ్రామాల్లో కాంగ్రెస్ నేతల పేర్లు జాబితాలో ఉండడం, నిరుపేదల పేర్లు లేకపోవడంపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండాపూర్, కొలనూర్, వేంకట్రావుపేట, నాగారం, మరిమడ్ల, గోవిందరావుపేట తండా, బావుసాయిపేటలో జరిగిన గ్రామ సభలూ గరం.. గరంగా జరిగాయి.

ఇదేం ప్రజాపాలన..?

రుద్రంగి, జనవరి 23: రూప్లానాయక్‌తండా, సర్పంచ్‌తండాలో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. రుద్రంగిలో నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు పథకాలకు సంబంధించి జాబితాల్లో చాలా మంది పేర్లు రాకపోవడంతో గ్రామస్తులు భగ్గుమన్నారు. గతంలోనే దరఖాస్తులు ఇచ్చినప్పటికీ తమను ఎందుకు ఎంపిక చేయలేదంటూ, ఇదేం ప్రజాపాలన అంటూ వాపోయారు. జీపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు ఎగబడ్డారు.

గందర గోళంగా సభలు

ముస్తాబాద్/బోయినపల్లి, జనవరి 23: ముస్తాబాద్ మండలకేంద్రం, పోతుగల్, నామాపూర్, బందనకల్, బోయినపల్లి మండలం మానువాడ, కోరెం, నర్సింగాపూర్, తడగొండ, వరదవెల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామ సభలు గందరగోళంగా ముగిశాయి. జాబితాలో పేర్లు లేవని గ్రామస్తులు

- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం
- ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రుణమాఫీపై నిలదీత
- ఇండ్లు, భూములున్నోళ్లకే ఇస్తరా..? అంటూ మండిపాటు
- లబ్ధిదారుల జాబితాల ప్రకటనపై అభ్యంతరాలు

ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను నిలదీశారు.

వేములవాడలో అధికారుల నిలదీత

వేములవాడ, జనవరి 23: వేములవాడ పట్టణంలో 10వ వార్డులో నిర్వహించిన వార్డు సభ గందరగోళంగా మారింది. చైర్ పర్సన్ మాధవి, కౌన్సిలర్ సిరిగిరి రామ్‌చందర్‌తోపాటు అధికారులు హాజరయ్యారు. అయితే 150 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే 87 మందికే రావడం, 250 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే 157 మాత్రమే మంజూరైనట్లు అధికారులు ప్రకటించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను నిలదీశారు. కౌన్సిలర్ రామ్‌చందర్ మాట్లాడుతూ వార్డు సభల ద్వారా ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని, జాబితాలో పేర్లు రాని అర్హులకు పథకాలు ఎప్పుడు వర్తింపజేస్తారని అధికారులు చెప్పకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి వచ్చిందని చెప్పారు.

కాంగ్రెస్ సభలా వల్లంపట్ల గ్రామ సభ

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల సభలో మాట్లాడుతున్న రాఘవ రెడ్డి

ఇల్లంతకుంట, జనవరి 23: వల్లంపట్ల గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభ కాంగ్రెస్ సభలా మారింది. పొత్తూరుకు చెందిన భూంపెల్లి రాఘవ రెడ్డి హాజరై, ప్రభుత్వ పథకాలపై గొప్పలు చెబుతుండగా, గ్రామస్తులు తిరగబడ్డారు. గ్రామ సభకు ప్రత్యేక అధికారి శ్రీనివాస్ హాజరైనా కాంగ్రెస్ నాయకులే అన్నీ తామై వ్యవహరించగా ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. వంతపుడుల గ్రామంలో అర్హులను విస్మరించి, ప్రభుత్వ ఉద్యోగాలు, భూములు ఉన్న వారిని ఎంపిక చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

సిరిసిల్ల టౌన్, జనవరి 23: సిరిసిల్ల పట్టణంలోని 19వ వార్డులో సీసీ రోడ్డు పనులకు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలకు వందశాతం మౌళిక వసతుల కల్పించేందుకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. స్థానిక కౌన్సిలర్ వినతి మేరకు వార్డులో శిథిలావస్థకు చేరుకున్న రోడ్డు స్థానంలో రూ.6లక్షలు జనరల్ ఫండ్‌తో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. 38వ వార్డులో అశోక్‌నగర్‌లో అభివృద్ధి చేసిన 'అశోక చక్రం' చౌరస్తాను ప్రారంభించారు. ఇక్కడ కమిషనర్ లావణ్య, కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, గూడూరి భాస్కర్ పాల్గొన్నారు.

వార్డు సభలకు హాజరు

సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన వార్డు సభల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కళ పాల్గొన్నారు. విలేకరులతో మాట్లాడారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఇక్కడ మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ పాల్గొన్నారు.

19వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జనవరి 23: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు తప్పకుండా వర్తింపజేస్తామని, ఆందోళన వద్దని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం రుద్రవరంలో గ్రామసభలో పాల్గొని, మాట్లాడారు. జాబితాలో పేరులేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, అర్హులుంటే తప్పనిసరిగా పథకాలను వర్తింపజేస్తామన్నారు. రేషన్‌కార్డులలో తప్పులున్నా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇక్కడ ఎంపీడీవో మల్హోత్రా, తహసీల్దార్ మహేశ్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణదేవరావు ఉన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద ఆర్‌టీఐ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవ ర్యాలీ నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, తప్పనిసరిగా వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఇక్కడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, డీటీవో లక్ష్మన్, ఎంవీఐ వంశీధర్, డిపో మేనేజర్ శ్రీనివాస్, సీఐ వీరప్రసాద్, ఎస్ఐ రాజు, ఆటో యూనియన్ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామ సభలు కావు.. కాంగ్రెస్ సభలు

రుద్రంగి, జనవరి 23: సర్పంచులు లేకుండా గ్రామసభలు జరుగుతున్న ఏకైక రాష్ట్రం దేశంలో ఒక్క తెలంగాణ మాత్రమేనని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దెగావత్ తిరుపతి విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను దూరం చేసేందుకే పథకాల పేరిట గ్రామ సభలు నిర్వహిస్తూ మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నదని దుయ్యబట్టారు. అవి గ్రామ సభలు కాదని, కాంగ్రెస్ సభలు అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించామని చెబుతున్నారని, స్థానికంగా చూస్తే ఒక్కో గ్రామానికి కనీసం ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖల అధ్యక్షులు నాయిని రాజేశం, నేతలు మంగీలాల్, మోహన్, రమణయ్య, గజన్, రాందాస్, భూపతి పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు ఆదర్శప్రాయం

కలెక్టరేట్, జనవరి 23: మహనీయుల జీవితాలు ఆదర్శప్రాయమని, మనం అనేక వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్చుకోవచ్చని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్, అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించిన మహనీయుడు సుభాష్ చంద్రబోస్ అని, ఆయన జయంతి వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, కలెక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కబ్జా కాలువకు విముక్తి

- రైతు ఫిర్యాదుకు కలెక్టర్ స్పందన
- అధికారులతో సర్వే.. మళ్లీ జేసీబీతో తవ్వకం

కోనరావుపేట, జనవరి 23: రైతు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్ స్పందించారు. ఏండ్లుగా ఓ వ్యక్తి కబ్జాలో ఉన్న కాల్వకు విముక్తి కల్పించారు. వివరాల్లోకి వెళితే.. పల్లి మక్త ఊరచెరువు మత్తడి నుంచి దూకిన నీరు వెళ్లే కాలువను సుద్దాల గ్రామానికి చెందిన ఉప్పుల దేవయ్య కబ్జా చేశాడని, దీంతో మత్తడి దూకిన నీరు దారి లేక సమీపంలోని పంట పొలాల్లోకి వచ్చి రైతులకు నష్టం కలుగుతున్నదని కొద్దిరోజుల క్రితం ప్రజావాణిలో బాధిత రైతు నర్సయ్య ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమస్యను పరిష్కరించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వెంటనే అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కబ్జాలో ఉన్న కాలువను పరిశీలించారు. జేసీబీ సాయంతో కంచెను తొలగించి, నీరు వెళ్లేందుకు వీలుగా మళ్లీ కాలువను తవ్వించారు. కాగా, సమస్యను పరిష్కరించిన కలెక్టర్‌కు రైతులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సుద్దాలలో కాలువను పరిశీలిస్తున్న అధికారులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రజిత

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎస్ రజిత

కలెక్టరేట్, జనవరి 23: ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో స్కానింగ్ సెంటర్లు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎస్.రజిత ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాద్ తెలంగాణ ఆదేశాల ప్రకారం పీసీపీఎన్‌డీటీ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించి, ఆమె మాట్లాడారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్లను నిబంధనల మేరకు నిర్వహించాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీల్లో గుర్తించిన ఫామ్-ఎఫ్ ఆడిట్లను, స్కానింగ్ సెంటర్ల వివరాలపై చర్చించారు. నిబంధనలు ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డా.లక్ష్మీనారాయణ, పీఓఎంఎస్ఎన్ డా.అంజలి ఆల్ఫ్రెడ్, డీజీవో శోభారాణి, ఎన్జీవో చింతోజు భాస్కర్, లీగల్ అడ్వైజర్ శాంతి ప్రకాశ్ శుక్ల, రామాంజునమ్మ, ఝాన్సీ లక్ష్మి ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ఇల్లంతకుంట, జనవరి 23: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ మండల కేంద్రం నుంచి సిద్దిపేట ప్రధాన రహదారిలో వెంకట్రావుపల్లి, గొల్లపల్లి గ్రామాల రోడ్డుకు మరమ్మతులు చేయించారు. రోడ్డుకు ఇరువైపులా గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎస్ఐ స్పందించి, బాగు చేయించగా, ఆటో డ్రైవర్లు, గ్రామస్తులు సంబురపడ్డారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్

గంభీరావుపేట, జనవరి 23: ముచ్చర్ల జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గోపా ఆధ్వర్యంలో గురువారం స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్లమల్ల లక్ష్మణ్ మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

రుద్రంగి, జనవరి 23: మానాలలో 14 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను గురువారం రాష్ట్ర యూనియన్ కోపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ యాదగిరి, నాయకులు తూం జలపతి, తోక, రాందాస్, దూప, వసంత్, ప్రకాష్, గంగారాం పాల్గొన్నారు.

వరదవెల్లి కెనాల్ గేట్ల వద్ద మృతదేహం

బోయినపల్లి, జనవరి 23 : వరదవెల్లి శివారులోని వరదకాలువ గేట్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరదవెల్లిలోని వరదకాలువ గేట్ల వద్ద నీటిపై మృతదేహం తేలినట్లు ఆ ప్రాంత రైతులు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా, పురుషుడి మృతదేహం అని, ఒంటిపై తెలుపురంగు చొక్కా, రింగులు రింగులుగా నలుపు రంగులో ఉన్న లుంగీ ధరించి ఉన్నాడని, 5 అడుగుల ఎత్తు, వయస్సు 30 నుంచి 40 ఏండ్ల మధ్య ఉంటాడని తెలిపారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే బోయినపల్లి పోలీస్‌స్టేషన్ ఫోన్ నంబర్ 871265418కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఫొటోగ్రాఫర్ బలవన్మరణం

గంభీరావుపేట, జనవరి 23: మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ వెన్ను శ్రీకాంత్(27) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వివాహాది శుభకార్యాలకు ఫొటోలు తీస్తూ జీవనోపాధి పొందుతున్న యువకుడు, తన ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సిరిసిల్ల దవాఖానకు తరలించారు. కాగా ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

అనువంశిక అర్చక కుటుంబాలకే అవకాశం ఇవ్వాలి

వేములవాడ టౌన్, జనవరి 23: వేములవాడ పట్టణానికి చెందిన 128 అనువంశిక అర్చక కుటుంబాల నుంచే 11 అర్చక, 2 శ్రీ వైష్ణవ అర్చక పోస్టులను భర్తీ చేయాలని వేములవాడ అనువంశిక బ్రాహ్మణ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. ఈ మేరకు గురువారం రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయంలో 11 అర్చక పరిచారక పోస్టులు, 2 శ్రీ వైష్ణవ అర్చక పోస్టుల భర్తీ 12 ఏళ్లుగా పెండింగ్‌లోనే ఉందన్నారు. 1200 ఏండ్లుగా ఆలయంలో అనువంశిక అర్చక కుటుంబాల వారసులే అర్చకులుగా పూజాది కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కమిషనర్ ద్వారా అందిన ఉత్తర్వులలో కూడా అనువంశిక కుటుంబాల వారిని మాత్రమే అర్చకులుగా నియమించాలని పేర్కొన్నందున వారికే అవకాశం ఇవ్వాలని వినతి పత్రంలో కోరినట్లు చెప్పారు.

భూమి కోసం తండ్రిపై దాడి

ఎల్లారెడ్డిపేట, జనవరి 23: మండల కేంద్రానికి చెందిన నేవూరి వెంకట్‌రెడ్డిపై అతని కొడుకు, కోడలు దాడి చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. వెంకట్‌రెడ్డిని పోషించకుండా అతని పేరు మీద ఉన్న భూమిని కొడుకు రమేశ్‌రెడ్డి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని కొంత కాలంగా ఇబ్బంది పెడుతున్నాడు. ఇదే విషయమై గురువారం రమేశ్‌రెడ్డి-లావణ్య దంపతులు కలిసి వెంకట్‌రెడ్డిపై దాడి చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొప్పాపూర్‌లో ఇల్లు కోసం..

ఎల్లారెడ్డిపేట, జనవరి 23: బొప్పాపూర్‌కు చెందిన జాగిరి రాజవ్వ, ఆమె కూతురు పద్మపై దాడి చేసిన కోడలు, ఆమె అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల ప్రకారం రాజవ్వ పేరిట ఉన్న ఇల్లును తన కూతురి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని రాజవ్వ కోడలు దేవేంద్ర ఒత్తిడి తెచ్చింది. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఉన్న కూతురు పద్మకు రాజవ్వ చెప్పగా ఆమె బొప్పాపూర్‌కు చేరుకుంది. తన పదిన దేవేంద్రను నిలదీసింది. దీంతో కోపోద్రిక్తురాలైన దేవేంద్ర, తన అల్లుడు తిరుమల్ కలిసి పద్మను కర్రతో కొట్టగా తలకు గాయాలయ్యాయి. రాజవ్వపైనా దాడి జరిగింది. రాజవ్వ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకులు

వేములవాడ రూరల్, జనవరి 23: మర్రిపల్లిలో గౌడ కులస్తులకు కాటమయ్య సేఫ్టీ మోకులను పంపిణీ చేసినట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజమనోహర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికులు జాగ్రత్తగా కల్లుగీయాలని, తప్పనిసరిగా సేఫ్టీ మోకులను వాడాలని సూచించారు. ఇక్కడ శిక్షకులు గుర్రం శ్రీనివాస్, అంజిగౌడ్, వెంగల తిరుపతిగౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు తీగల రాములుగౌడ్, ఉపాధ్యక్షులు చింతలకోటి రవీందర్‌గౌడ్, రాజాము ల్లుగౌడ్, ఎల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఉచిత విద్య

ముస్తాబాద్, జనవరి 23: ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండాకు చెందిన పేద విద్యార్థి రమావత్ రోహిత్ చదువులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అండగా నిలిచారు. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్న రోహిత్ గతేడాది సెప్టెంబర్ 20న పాము కాటుకు గురయ్యాడు. అప్పటి నుంచి ఇంటివద్దే ఉంటున్నాడు. రోహిత్ చదువుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో తల్లిదండ్రులు చందు- రజిత కలిసి కలెక్టర్ వద్దకు వెళ్లి వేడుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని మహర్షి ఇంగ్లిష్ మీడియం పాఠశాల యజమాన్యం రోహిత్‌కు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్యను అందించేందుకు ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా కలెక్టర్‌కు విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాల నివారణకు రంబుల్ స్ట్రిప్స్

చందుర్తి,జనవరి 23: చందుర్తి మండలకేంద్రంలో తరచూ రోడ్డు ఆక్సిడెంట్లు జరిగే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు గురువారం రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినట్లు చందుర్తి ఎస్ఐ అంజయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రోడ్ల వెంట ఉన్న ముళ్లపొదలు, రోడ్డుపై గుంతలను పూడ్చివేసినట్లు చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే వెహికిల్ సీజ్ చేయడంతో పాటు, లైసెన్స్ కూడా రద్దు చేస్తామని వివరించారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT NIZAMABAD
ARB/DISPUTE NO.243 OF 2024
Between:
Chaitraratha Chits Pvt.Ltd., Kamareddy Br. ...Disputant
And
Mr.Ganta Ashok & Others ..Opponenets
NOTICE
To,
Opponents No.2
2.AJMERA MOHAN, S/o. A.RAJU, Age: 47 Years, Occ:SGT UPS at Narmala R/o. H.No. 3-16, Vill: Dhammannapet, Mdl: Gambhiraopet, Dist. Rajannasiricilla
Opponents No.4
4. Peningari Karthik S/o. P. Lachaiah, Age: 26 Years, Occ: Business, R/o.H.No.3-1-26/A, Sri Rama College Road, Vill: & Mdl: Gambhiraopet, Dist. Rajanna Siricilla.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Summmons were issued to you, but you have failed to receive the same. The above Dispute is posted on 05-02-2025 for your appearance. On that day you have to appear in person at 10-00 A.M before the Deputy Registrar referred above Other wise the case will be decided ex-parte.
Sd/- DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR NIZAMABAD

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT NIZAMABAD
ARB/DISPUTE NO.244 OF 2024
Between:
Chaitraratha Chits Pvt.Ltd., Kamareddy Br. ...Disputant
And
Mr.DUBASI RAJU & Others ..Opponenets
NOTICE
To,
Opponents No.4
4.RODDA NARSIMLU S/o. R.NARSAIAH, Age: 47 Years, Occ: HELPER CO-OP ELECTRIC SUPPLY SOCIETY LTD at LAXMIPOOR, R/o. H.No. 1-6-50, Reddywada Vill & Mdl: Gambhiraopet, Dist. Rajanna Siricilla
Opponents No.5
5. GANTA ASHOK S/o. G.RAJAIAH, Age 38 Years, Occ:Business R/o. H.No.3-1-24, Vill & Mdl: Gambhiraopet, Dist. RajannaSiricilla.